క్లుప్తంగా

శివాలయాన్ని సందర్శించిన ఎంపీపీ



శివాలయంలో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాస్వామి వారి ఆలయాన్ని బుధవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సందర్శించారు. ఆలయంలోని సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలు చోరీకి గురికావడంతో ఆలయాన్ని సందర్శించి చోరీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ సాదేలోవరాజు, అల్లం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

100 మందికి కంటి పరీక్షలు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన హైమా నేత్రాలయం సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 100 మందికి కంటి పరీక్షలు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ లలిత తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అధ్యాపకులు ఎం.సుధాధర్, సింహాద్రి, సౌజన్య, ఎన్ఎస్ఎస్ పీఓలు ఢిల్లేశ్వరరావు, ఇందిరా ప్రియంకా, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి నేరేళ్లమ్మతల్లి జాతర మహోత్సవాలు



నేరేళ్లమ్మతల్లి

అన్నవరం: గ్రామ దేవత నేరేళ్లమ్మ తల్లి జాతర మహోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా సత్యదేవుని కల్యాణ మహోత్సవాలు ముగిసిన తరువాత ఈ ఉత్సవాలను దేవస్థానం నిర్వహిస్తోంది. సత్యదేవునికి ఆడపడుచుగా నేరేళ్లమ్మతల్లికి ఈ జాతర మహోత్సవాల్లో చీర, సారె, సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 19 వరకూ తొమ్మిది రోజుల అమ్మవారికి ప్రత్యేక పూజలు, గరగల సంబరం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గౌరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



గౌరంపేటలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- రోటరీ యూత్ సర్వీసెస్ చైర్మన్ రమణరావు
- మహిళల హాకీ టోర్నీ ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటి): రోటరీ యూత్ సర్వీసెస్ మంత్‌లో భాగంగా యువతకు నైపుణ్యాలను పెంపొందించేందుకు పలు క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ యూత్ సర్వీసెస్ చైర్మన్ టీవీ రమణారావు పేర్కొన్నారు. బుధవారం క్లబ్ ప్రెసిడెంట్ సురభిశారద ఆధ్వర్యంలో జిల్లా క్రీడామైదానంలోని హాకీ మైదానంలో మహిళలకు టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ధరణి కన్‌స్ట్రక్షన్స్ అధినేత రమణారావు మాట్లాడుతూ యువతకు వారి వారి క్రీడల్లో నైపుణ్యాలు వృద్ధి చేయడానికి టోర్నమెంట్లు దోహదపడతాయన్నారు. హాకీ కోచ్ రవిరాజు మాట్లాడుతూ టోర్నీ నిర్వహిస్తున్న రోటరీ సభ్యులను అభినందించారు. చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ కాకినాడ చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథులు బెలూన్లు ఎగురవేసి, శాంతి కపోతాలను గాలిలోకి వదిలి, ఫ్రీహిట్ గోల్స్ వేసి టోర్నీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ పాస్ట్ గవర్నర్ టిక్కు, ఎలక్ట్ ప్రెసిడెంట్ గోపు కాశీవిశ్వనాథ్, సెక్రటరీ కోనాడ ప్రకాశరావు, సభ్యులు రిక్కి గూటం, స్వరాజ్, డాక్టర్ విజయ కృష్ణ, సలాది సూర్య కిరణ్, బ్లూస్టార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధి పనులు

- చురుగ్గా చెరువుల్లో పూడికతీత
- మూడు నియోజకవర్గాల్లో పనులకు 30 వేల మంది కూలీలు
- గత నెలతో పోల్చితే వందశాతం పెరిగిన కూలీల సంఖ్య



డి.పోలవరం వరకట్టు చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ఎస్‌బీ పేటలో పంటకాలువల్లో పూడిక తీస్తున్న కూలీలు

తుని రూరల్: తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. మెట్ట ప్రాంతంలోని సాగునీటి చెరువులు, పంట కాలువల్లో పూడిక తీత పనులు జోరుగా సాగుతున్నాయి. చెరువుల్లో సాగునీటి నిల్వలు పెంపు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పూడిక తీత పనులను ఈ నెల మొదటి వారం నుంచి చేపట్టారు. గత నెల నుంచి రోజువారీ కూలి రూ.272కు పెరగడం,

నియోజకవర్గం	గ్రామ పంచాయతీలు	పనులకు వస్తున్న కూలీలు
తుని	62	9935
ప్రత్తిపాడు	75	12777
జగ్గంపేట	53	7076
మొత్తం	190	29,788

ఇప్పుడు పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టడంతో కూలీల హాజరు సంఖ్య ఘననీయంగా పెరుగుతోంది. గత అదివారం, బుధవారం నుంచి కొత్తగా కూలీలు వచ్చి పనుల్లో చేరుతుండడంతో ఈ నెల మొదట పదిరోజుల సరాసరిగా (రోజుకు) 29,788 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు తెలిపారు. ఏప్రిల్ నెలలో రోజువారి కూలీ రూ.249 లభించగా ఈ నెలలో రూ.265కిపైగా లభించవచ్చని పలువురు కూలీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొలతలకు అనుగుణంగా పనులు పూర్తి చేస్తే గరిష్టంగా రోజుకూలి రూ.272 పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

10 మండలాల్లో ముమ్మరంగా పనులు

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో పది మండలాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాలకు చెందిన 190 పంచాయతీల్లో చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టారు. వేసవి కావడం వల్ల, పనులు సులభంగా ఉండడంతో ఎక్కువ మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు.

మండువేసవైన పనులు

మండువేసవి అయినప్పటికీ తుని మండలంలో 5800 మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. ఇందులో 60 శాతానికి పైగా మహిళా కూలీలు హాజరవుతున్నారు. వేసవి దృష్ట్యా ఉదయమే వచ్చి చెరువులు, పంట కాలువల్లో పూడిక తీత పనులు చేస్తున్నారు. వడగాల్పులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని టీఏ, ఎఫ్ఏ, మేట్లతో కూలీలకు సూచనలు ఇస్తున్నాం. కూలీల సంఖ్య మరింత పెంచాలని ఎఫ్ఏ, మేట్లను ఆదేశించాం. గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నాం. కూలి డబ్బుల చెల్లింపులో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఏర్పాట్లు చేశాం.

– పసుపులేటి నారాయణరావు, ఏపీఓ, తుని మండలం

నెలాఖరుకు 'నాడు-నేడు' పనులు పూర్తి చేయాలి



తొండంగిలో అధికారులకు సూచనలిస్తున్న డీఈఓ అన్నపూర్ణ

తొండంగి: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు-నేడు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని డీఈఓ అన్నపూర్ణ అధికారులను ఆదేశించారు. తొండంగి, ఎ.కొత్తపల్లిలో జగనన్న విద్యాకానుక కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యాసంవత్సర ప్రారంభ సమయానికి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించాలన్నారు. విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట పలువురు విద్యాశాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వచ్చారు.. వెళ్లారు

- కోరం లేకుండా కౌన్సిల్ సమావేశం
- చర్చకు రాని ప్రజాసమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అలమండ సత్యవతి

ఏలేశ్వరం: అధికారులు నిబంధనలకు నీళ్లు చల్లారు. కోరం లేకుండా కౌన్సిల్ సమావేశం నిర్వహించి విమర్శల పాలయ్యారు. కౌన్సిల్‌లో 20 మంది సభ్యులకు గాను చైర్‌పర్సన్‌తో కలిపి ఏడుగురి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రారంభమైన అరగంటకే సమావేశం ముగిసింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అధికార వైఎస్సార్ సీపీ సభ్యులు ఐదుగురు, ప్రతిపక్ష టీడీపీ సభ్యులు ఇద్దరు, ఒక కోఆప్షన్ సభ్యుడు హాజరయ్యారు. తొలుత అజెండా చదివి వినిపించారు. ప్రజాసమస్యలపై చర్చించకుండా తూతూ మంత్రంగా కౌన్సిల్ సమావేశం ముగించారు. పట్టణంలోని 5, 8, 19, 20 వార్డుల్లో తాగునీటి ఎద్దడి లేకుండా రూ.9.50 లక్షలతో నీటివసతి కల్పించేందుకు తీర్మానం అమోదించారు. కోరం లేకుండా కౌన్సిల్ సమావేశం నిర్వహించడంపై అధికారులను ప్రశ్నించగా ముందుగానే సంతకాలు చేసి వెళ్లిపోయారని చెప్పడం కొసమెరుపు. కార్యక్రమంలో కమిషనర్ కొండలరావు, మేనేజర్ కె.శ్రీనివాసరావు, వైస్‌చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

13న జాబ్‌మేళా

కోటనందూరు: కాకినాడకు చెందిన బెస్ట్ కెరీర్స్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 13న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేవీ రమణ బుధవారం తెలిపారు. కాకినాడ గాంధీనగర్‌లోని బెస్ట్ కెరీర్స్ కార్యాలయంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ఇండిగో ఎయిర్‌లైన్స్, భారత్ మొబైల్ కంపెనీ, బిగ్ బాస్కెట్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్, అపోలో ఫార్మసీ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీ టెక్, ఎంబీఏ పూర్తి చేసి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 77990 90545, 95152 58225, 91547 62596 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



హైవేపై వెలంపేట కాలనీవద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై బాలాజీ

తుని రూరల్: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలని రూరల్ ఎస్సై ఎ.బాలాజీ సూచించారు. జాతీయ రహదారిపై వెలంపేట కాలనీ వద్ద బుధవారం సాయంత్రం పాదచారులు, వాహనచోదకులకు హెల్మెట్ ధారణ, ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ఆవశ్యకతలపై అవగాహన కల్పించారు. కాకికాడ జిల్లా ఎస్పీ, పెద్దాపురం డీఎస్పీ ఆదేశాలు మేరకు వాహనదారుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం వాహన తనిఖీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గేదెల మృతి

ప్రత్తిపాడు రూరల్: జాతీయ రహదారిపై మండలంలోని ధర్మవరం వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మూడు గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో మూడు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పశువైద్య అధికారులు గాయపడిన పశువులకు వైద్య సేవలు అందించారు. గాయపడిన మూడు గేదెల పరిస్థితి విషమంగా ఉన్నట్టు వారు తెలిపారు.

మహాయజ్ఞంలో భాగస్వాములు కండి



పెన్మెత్స విశ్వనాథరాజు, ఈఓ లోవదేవస్థానం

తుని రూరల్: విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17 వరకు నిర్వహించే అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత లక్ష్మీ మహాయజ్ఞంలో భక్తులు భాగస్వాములు కావాలని లోవదేవస్థానం ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు కోరారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణార్థం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజల సౌభాగ్యం, పాడిపంటల సమృద్ధి, ప్రకృతి అనుగ్రహం కోసం ప్రభుత్వం మహాయజ్ఞం నిర్వహిస్తోందని తెలిపారు. ఈ యజ్ఞంలో వేలాదిగా భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. భక్తులు యజ్ఞాన్ని వీక్షించేందుకు అవసరమైన ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో దేవదాయశాఖ చేస్తుందని చెప్పారు.

సంక్షేమ ప్రభుత్వానికి బాసటగా నిలవండి



తుని 22వ వార్డులో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, బాలు

తుని: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు బాసటగా నిలివాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు. పట్టణంలోని 22వ వార్డులో కౌన్సిలర్ కోలా శ్రీను ఆధ్వర్యంలో బుధవారం మన మున్సిపాలిటీ-మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు గడప గడపకూ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికంగా ఉన్న పలు సమస్యలను మహిళలు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ప్రసాదరాజుకు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎండ.. ప్రచండం



ఏలేశ్వరంలో ఎండకు నిర్మానుష్యంగా మారిన హనుమాన్ జంక్షన్

ఏలేశ్వరం: ఎండలు మండిపోతున్నాయి. వేసవి తాపానికి నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపాడు. ఇటీవల వర్షాలు కురవడం, ప్రస్తుతం ఎండలు ముదరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల ముహూర్తాలు ఉండడంతో సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎండల కారణంగా ప్రధానరహదారులు జనసంచారం లేక వెలవెలబోయాయి. వాహనదారులు ఎండను తట్టుకొనేందుకు గొడుగులు, ముసుగులు ధరించారు. జాతీయరహదారిపై సైతం మధ్యాహ్న సమయంలో వాహనాల రాకపోకలు కనిపించలేదు.

వడగాడ్పులతో జనం విలవిల

తుని: అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజువారీ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. గురువారం వడగాడ్పుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. వృద్ధులు, పిల్లలు ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. పనుల కోసం బయటకు వచ్చే ప్రజలు టోపీ పెట్టుకుని, ముసుగు ధరించి వెళ్లాలన్నారు. తరచు మంచి నీరు, మజ్జిగ, గ్లూకోజ్, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తీసుకోవాలని అధికారులు, వైద్యులు సూచిస్తున్నారు.

భానుడి ప్రతాపానికి అల్లాడిన ప్రజలు

తొండంగి: ఎండల తీవ్రతకు ప్రజలు అల్లాడుతున్నారు. బుధవారం ఉదయం నుంచే అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. మరికొద్ది రోజలపాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించడంతో వడ దెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు.



ఏలేశ్వరంలో ఎండ నుంచి రక్షణకు గొడుగు వేసుకుని వెళుతున్న మహిళలు



మోటారుబైక్‌పై ముసుగుతో వెళుతున్న వాహనదారుడు



నిర్మానుష్యంగా మారిన గోపాలపట్నం-తొండంగి రహదారి

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- కొత్తపల్లిలో నూతన ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన



కొత్తపల్లిలో ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో రూ.2.21 కోట్ల అంచనాలతో నూతనంగా నిర్మించే పది పడకల ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే చంటిబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. అనంతరం తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వాస్పత్రిని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు, గ్రామ సర్పంచ్ కంచుమర్తి కాటమ స్వామి, ఉప సర్పంచ్ తోట సంధ్యాదేవి, ఎంపీటీసీలు ఎం.భువనేశ్వరి, గుడేల చిన్న, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కేవీఎస్ఎన్ మూర్తి, ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, డాక్టర్లు రవిచంద్ర, తిరస్, లిఖిత ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అయర్లా రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి



తుని పట్టణంలో ర్యాలీ చేస్తున్న సీపీఐ (ఎంఎల్) ప్రతినిధులు

తుని: అనకాపల్లిలో ఈ నెల 25న నిర్వహించే అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (అయర్లా) ఐదో రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రావు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) కార్యకర్తలు, పలు కార్మిక సంఘాల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంగార్రావు మాట్లాడుతూ అయర్లా రాష్ట్ర మహా సభలకు సంఘ జాతీయ అధ్యక్షుడు సత్యదేవ్‌రామ్, అయర్లా జాతీయ ప్రధాన కార్యదర్శి ధీరేంద్రఝా ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. గ్రామీణ వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారన్నారు. అనంతరం పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రతినిధులు కె.జనార్దన్, వాడబోయిన శివ, యర్రంశెట్టి అప్పారావు, చెదుకూరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



రేఖవానిపాలెం పంపుహౌస్‌లో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు

తుని: మండలంలోని రేఖవానిపాలెం ప్రధాన పంపుహౌస్‌లో మరమ్మతు పనులు చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. బుధవారం మున్సిపల్ డీఈఈ ప్రకాశరావుతో కలిసి ఆయన పనులను పరిశీలించారు. పంపుహౌస్‌లో పేరుకుపోయిన ఒండ్రు మట్టిని నిపుణులైన కార్మికులతో బయటకు తీస్తున్నామన్నారు. పట్టణ పరిధిలోని 1 నుంచి 10 వార్డులకు తాత్కాలికంగా నీటి సరఫరా నిలిపి వేశామన్నారు. కత్రాళ్లకొండ పంపుహౌస్ ద్వారా పరిమితంగా నీటిని సరఫరా చేస్తున్నామని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు. ఈ నెల 14 వరకు పనులు జరుగుతాయని చెప్పారు.

దేవదాయశాఖ పరిధిలోకి రావులమ్మతల్లి ఆలయం



జగ్గంపేట రావులమ్మతల్లి ఆలయంలో హుండీకి సీల్ వేస్తున్న అధికారులు

జగ్గంపేట: గ్రామంలో వేంచేసిన రావులమ్మతల్లి ఆలయం బుధవారం నుంచి దేవాదాయ,, ధర్మాధాయశాఖ పరిధిలోకి వచ్చినట్లు పెద్దాపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలోనే రావులమ్మతల్లి ఆలయ ప్రాంగణంలోని హుండీకి సీల్ వేశారు. ఇకపై దేవదాయశాఖ అధికారులు ఆధ్వర్యంలోనే హుండీ తెరిచి ఆదాయం లెక్కిస్తారని తెలిపారు. ఎవరైనా సీల్ వేసిన హుండీలను ధ్వంసం చేసినా, చోరీ చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూరిమిల్లి రమణ పాల్గొన్నారు.

రైలు నుంచి దూకి వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

తుని: స్థానిక రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి దూకి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు సాస్థానిక రైల్వే ఎస్సై అబ్దుల్ మారూఫ్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అస్సాం రాష్ట్రం దేమాజీ జిల్లా శశిబెంగాలి గ్రామానికి చెందిన తోలోస్ ప్రసాద్ (35), ఆనంద్ దాస్ (30) ఇద్దరు కలిసి ఉదయం ఎనిమిది గంటల సమయంలో బెనారస్ వీక్లీ స్పెషల్ ట్రైన్ కిందకు దూకారు. ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా ఆనంద్‌దాస్‌కు రెండుకాళ్లు తెగిపడ్డాయి. వెంటనే రైల్వే సిబ్బంది ఆనంద్ దాస్‌ను తుని ఏరియా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కాకినాడ ఆస్పత్రికి తరలించారు. వారిద్దరూ అత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రాజపూడి గ్రామ సర్పంచ్‌పై దాడి

జగ్గంపేట: మండలంలోని రాజపూడి గ్రామ సర్పంచ్ బూసాల విష్ణుమూర్తిపై అదే గ్రామానికి చెందిన ఒక మహిళతో పాటు ముగ్గురు వ్యక్తులు దాడిచేయగా వారిపై కేసు నమోదు చేసినట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రాజపూడి గ్రామ సర్పంచ్ బూసాల విష్ణుమూర్తి గ్రామంలో డ్రైనేజీలు, పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించారు. ఈ నేపథ్యంలో శివాలయం వీధిలో రోడ్డుపై గేదెలను కట్టి అక్కడ అపరిశుభ్రతకు కారణమైన తిరువేదుల అప్పారావు ఇంటి వద్ద ఆగి ఇతరులకు ఇబ్బంది లేకుండా చేసుకోవాలని సూచించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అప్పారావు, అతని కుటుంబ సభ్యులు వెంకటలక్ష్మి, స్వామి, శ్రీను సర్పంచ్‌పై దాడి చేసారు. దీనిపై సర్పంచ్ విష్ణు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.